క్లుప్తంగా

విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల దృష్టిలోపాలను అధిగమించవచ్చని కంటివైద్యాధికారి షేక్‌షావలి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 246 మంది విద్యార్థులకు కంటిచూపు పరీక్షలు నిర్వహించగా 13 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీనాయక్, సూపర్‌వైజర్ గుర్రప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు



కమిషనర్‌కు బొకే అందజేస్తున్న చైర్ పర్సన్ మారుఫ్ ఆసియా

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఎల్ రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా కమిషనర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కమిషనర్ హామీ ఇచ్చారు.

పైపులైన్ నిర్మాణంలో నాణ్యత లేదు

నందికొట్కూరు: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు వరకు వేసే పైపులైన్ నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లేదని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలో జరుగుతున్న పైపులైన్ పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలను ఓర్వకల్లు వద్ద నిర్మించే స్టీల్ ప్లాంట్ అవసరానికి తరలించే పైపులైన్ నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలి

మిడుతూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక వేత్త వీరకుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని సుంకేసుల గ్రామంలోని శ్రీ రామ దత్త ఆశ్రమంలో భద్రపద పూర్ణమిని పురస్కరించుకొని శ్రీ రామదత్త ఆశ్రమ వ్యవస్థాకులు శ్రీ జూలకంటి మలికార్జున రావు ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. వీరకుమార్‌గౌడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని మరుగున పడకుండా సరంక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అల్వాల రమేష్ శెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేసుకోకుంటే పథకాలు అందవు




ఈ-కేవైసీ వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: పంటనమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ చేసుకోకుంటే ప్రభుత్వ పథకాలు అందవని, ఈనెల 23వ తేదీలోపు ఈ-కేవైసీని పూర్తిచేయాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొక్కెరంచ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పంట నమోదు ఎంతమంది చేశారు, ఎంతమంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారో ఆరా తీశారు. ఈనెల 23 వరకే సమయం ఉందని, ఆలోపు ప్రతి ఒక్కరితో ఈకేవైసీ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అధిక వర్షాల కారణంగా పంటనష్టం జరిగిన రైతుల జాబితా వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం అన్ని రైతుసేవా కేంద్రాలల్లో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కె.మహేష్, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నీటివిడుదల పెంపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 30వేల క్యూసెక్కుల నుంచి 35వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో 881.80 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 880.80 అడుగుల నీటిమట్టం ఉందన్నారు.

ఏపీకి ట్రైనీ ఐపీఎస్ మనిషారెడ్డి



మహానంది: తెలుగు రాష్ట్రాలకు ట్రైనీ ఐపీఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మహానంది మండలం నందిపల్లె గ్రామానికి చెందిన వంగల మనీషారెడ్డిని ఏపీకి కేటాయించారు. దీంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎదురు చూస్తున్నాం



నా పేరు చల్లా శేషమ్మ. మాది ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్. నేను వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాకు నలుగురు పిల్లలు. ఇందులో ఓమేశ్వరి 10వ తరగతి, జయశ్రీ 9వ తరగతి, చిట్టి 7వ తరగతి, రామ్‌చరణ్ 5వ తరగతి చదువుతున్నారు.వీరిలో పెద్ద కుమార్తె కస్తూర్బాపాఠశాలలోనూ, మరోపాపను కూడా అదే పాఠశాలలో చేర్పించాను. ఇద్దరు చిన్నపిల్లలను ఇంటి వద్ద ఉన్న ప్రయివేట్ పాఠశాలకు పంపిస్తున్నాను. ఇద్దరు పిల్లలు కస్తూర్బా పాఠశాలలో చదువుతుండడంతో ఇబ్బందిలేదు. చివరి పిల్లలైన చిట్టి, రామ్‌చరణ్‌లకు ఫీజులు కట్టేందుకు ఇబ్బంది పడుతున్నా. ప్రతియేడాది జూన్ ప్రారంభంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు వేసేవాడు. వాటితో చిన్నపిల్లలకు ప్రయివేట్ పాఠశాలలకు ఫీజులు చెల్లించేవాళ్లం. కానీ ప్రస్తుతం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక నాకు నలుగురు పిల్లలకు ప్రతిఒక్కరికీ రూ.15 వేలు వస్తుందని ఆశ పడ్డాను. అయితే ఇప్పటికీ పిల్లలకు మొత్తం నలుగురికి రూ.60 వేలు వస్తాయో లేదో తెలియని పరిస్థితి. చదువుకున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తానని చెప్పాడు. వంద రోజులైనా ఇంతవరకు అందించలేదు. నేను దినసరీ కూలీగా పని చేస్తున్నా. వచ్చిన డబ్బులు పిల్లల ఫీజులకే సరిపోతోంది.

– చల్లా శేషమ్మ, ఏకలవ్యనగర్, ఆత్మకూరు

మా ఇంట్లో ముగ్గురం



నాకు ఇద్దరు ఆడబిడ్డలు 18 సంవత్సరాలు నిండిన వారు ఉన్నారు. నాబిడ్డలతో పాటు నాకు మొత్తం ముగ్గురికి నెలకు రూ.1,500 చొప్పున రూ.4,500 ఎపుడు వస్తాయా అని చూస్తున్నాం. ఎన్నికలకు ముందు 18 ఏళ్లు నిండిన ప్రతిబిడ్డకు నెలకు రు.1,500 ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతుంది. ఇంత వరకు ఏ ప్రకటన ప్రభుత్వం చేయలేదు. ఇవి నెరవేర్చే హామీనా, లేక అధికారంలోకి రావడం కోసం చేసిన మోసమా అర్థం కావడం లేదు.

– జి.సత్యవతి, సున్నిపెంటగ్రామం

‘సూపర్’ వల.. హామీల విలవిల!

- వంద రోజులైనా అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ హామీలు
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రజల్లో అపనమ్మకం
- పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకపోవడంతో అనుమానాలు
- నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం లేనట్లేనా?

అధికారమే పరమావధిగా సూపర్ సిక్స్ వల వేశారు చంద్రబాబు నాయుడు అండ్ కూటమి నేతలు. పథకాల పేరుతో, గతంకంటే ఘనంగా అంటూ హామీలు గుప్పిచ్చి ప్రజలను వంచించారు తెలుగుదేశం కూటమి పెద్దలు. ప్రజల అవసరాలు, అమాయకత్వాలను హామీల గారడీతో బురిడీ కొట్టించారు. శాసనసభలో ప్రవేశపెట్టి ఓటాన్ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు చిల్లి గవ్వ కేటాయించకుండా చేతులెత్తేశారు. అధికారం చేపట్టి వంద రోజులైనా పథకాలు అమలుకు నోచుకోలేదు. పైపెచ్చు పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని సాక్షాత్తూ ముఖ్యమంత్రే మాట్లాడటంతో పథకాల అమలుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు పిల్లల చదువులు.. మరో వైపు రైతన్నల అవసరాలు.. ఇంకో వైపు ఆడపడచుల ఆశలు.. నిరుద్యోగుల ఆర్తనాదాలతో అన్ని వర్గాలు విలవిల్లాడుతున్నారు.

ఆత్మకూరు/నందికొట్కూరు: మాటల గారడీతో ప్రజల్ని మభ్యపెట్టడం.. అధికారంలోకి వచ్చాక హామీలకు మంగళం పాడటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అనే అపవాదు ఉంది. దీన్ని నిజం చేస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. సూపర్ సిక్స్ పేరుతో ఆరు రకాల హామీల నెరవేరుస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా ప్రచారం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామని మాట ఇచ్చారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలైనా ఇప్పటికీ కూడా ఈ పథకానికి నిధులు ఇవ్వలేదు. దీంతో ప్రయివేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఫీజు భారమై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ దీనిపై స్పష్టత ఇవ్వలేదు. నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు హామీ ఇచ్చి..దాని గురించే మరచిపోయారు. 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ ప్రతి నెలా రూ.1500 ఖాతాల్లో జమ చేస్తామని వాగ్దానం చేశారు. అయితే ఇవేవీ ఇప్పట్లో అమలయ్యే సూచనలు కనిపించడం లేదు. దాటవేసే ధోరణిలో సీఎం చంద్రబాబు ప్రజలను మభ్య పెడతున్నారనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర పరిస్థితి చూసి సూపర్ సిక్స్ హామీలు వైపు చూడాలంటే భయమేస్తుందోని చెప్పడం, ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం హామీల అమలును గాలికి వదిలేశారనే అనుమానాలకు తావిస్తోంది. తల్లికి వందనం పథకం అమలుపై అధ్యయనం చేస్తున్నామని, మేధావులతో చర్చిస్తున్నామని, ఇంకా ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులతో పలుమార్లు చర్చించి అమలుపై సాధ్యాసాధ్యాలు తేలుస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ శాసనమండలిలో ప్రకటించడం చూస్తే.. పథకాల అమలులో వీరి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

ప్రజల్లో నిరాశ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైనా సూపర్ సిక్స్ హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు.

బాబుగారి సూపర్ సిక్స్ పథకాలు

1. అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేలు ఆర్థిక సహాయం
2. ‘తల్లికి వందనం’ కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి రూ 15 వేలు
3. ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీ
4. ఉద్యోగం వచ్చే వరకు నెలనెలా నిరుద్యోగ భృతిగా రూ. 3వేలు
5) 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ 1,500 సాయం
6. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం

సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి పేదల జీవితాలను మారుస్తాం.. అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ వాగ్దానం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించింది. ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. అలాగే అమ్మఒడి ద్వారా విద్యార్థులకు అండగా నిలిచింది. నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది. వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం..తదితర పథకాలను చెప్పినట్లు అమలు చేసింది. ప్రజలు ఎదురు చూడకుండా చెప్పిన సమయానికి చెప్పినట్లు నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది.

శ్రీశైలం నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వివరాలు



పథకం పేరు	లబ్ధిదారులు	మొత్తం
జగనన్న అమ్మ ఒడి	28932	రూ.117,17,52,429
జగనన్న వసతి దీవెన	14,456	రూ.16,00,90,904
జగనన్న విద్యా దీవెన	15,239	రూ.34,07,10,292
వైఎస్సార్ రైతుభరోసా	30,692	రూ.144,97,53,550
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల రైతులు	8,726	రూ.1,97,31,423
డాక్టర్ వైఎస్సార్ ఉచిత	15,464	రూ.40,38,15,430
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	12,974	రూ.13,04,90,487
మత్స్యకార భరోసా	39	రూ.7,40,000
వైఎస్సార్ సున్నా వడ్డీ(పొదుపు)	53,081	రూ.21,43,91,047
వైఎస్సార్ పెన్షన్ కానుక	32,702	రూ.309,05,35,250
వైఎస్సార్ చేయూత	14,584	రూ.75,81,73,250
వైఎస్సార్ ఆసరా	33,581	రూ.67,45,89,736
వైఎస్సార్‌బీమా	692	రూ.10,72,40,000
కాపునేస్తం	802	రూ.2,67,90,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	35	రూ.27,12,000
జగనన్న చేదోడు (రజక టైలర్స్, నాయిబ్రాహ్మిన్స్)	1880	రూ.3,94,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	1689	రూ.4,64,30,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7,829	రూ.5,28,47,025
స్పెషల్ కోవిడ్ అసిస్టెన్స్	59,238	రూ.5,92,38,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1971	రూ.5,30,55,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	12,855	రూ.48,66,30,831
వైఎస్సార్ కళ్యాణమస్తు/షాదీతోఫా	82	రూ.68,50,000
హౌసింగ్ (డీబీటీ)	4,856	రూ.47,35,08,656
జగనన్నతోడు (వడ్డీ)	3,925	రూ.18,61,567
జగనన్నతోడు రుణాలు	6,360	రూ.11,84,16,840
జనగన్న గోరుముద్ద	16,515	రూ.16,36,14,105
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	8,920	రూ.16,70,71,600
జగనన్న విద్యా కానుక	16,922	రూ.12,01,80,044

నందికొట్కూర్ నియోజకవర్గంలో.. జగనన్న ఐదేళ్ల ప్రభుత్వంలో..

పథకం పేరు	లబ్ధిదారులు	రూ.లో
రైతు భరోసా	128512	1734912000
అమ్మ ఒడి	124221	733851000
వైఎస్ఆర్ ఆసరా	12207	819260862
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	102218	3066400000

నా ముగ్గురు పిల్లలకు ‘తల్లికి వందనం’ ఇవ్వాలి



మా ఇంట్లో ముగ్గురు పిల్లలు చదువుతున్నారు. పిల్లవాడు నందికొట్కూరులో ప్రైవేట్ కళాశాలలో ఐటీఐ చేస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. జగనన్న ప్రభుత్వంలో ఏటా అమ్మ ఒడి సకాలంలో వచ్చింది. ఈ ప్రభుత్వం(టీడీపీ కూటమి) తల్లికి వందనం పథకం కింద ఎంత మంది చదివితే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. మా ముగ్గురి పిల్లలకు రూ.45 వేలు ఇవ్వాలి. ఇంకా ఆ డబ్బు నా ఖాతాలో జమ చేయ లేదు. ఇంకా విధి విధానాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. – ఆశీర్వాదమ్మ, పగిద్యాల

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నిరుద్యోగ భృతి 35 ఏళ్ల కేవరకే అంటున్నారు. నాకు ఇప్పుడు 37 ఏళ్లు. ప్రభుత్వ ఉద్యోగాలకే 42 ఏళ్ల వరకు అవకాశం ఉంటుంది. అలాంటిది నిరుద్యోగ భృతికి మాత్రం 35 ఏళ్ల కటాఫ్ పెట్టడం సరికాదు. 45 ఏళ్ల వయస్సు వరకు నిరుద్యోగ భృతి వర్తింప చేయాలి. నా డిగ్రీ 2010 పూర్తయింది. అప్పటి నుంచి ఉద్యోగ ప్రయత్నంలోనే ఉన్నా ఫలితం లేకపోవడంతో ఇటీవల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నా. భార్య పిల్లల జీవనం కష్టమైంది. నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి. – శీలం అచ్చన్న, ముసలిమడుగు

శ్రీశైలం నియోజకవర్గం		
పథకంపేరు	లబ్ధిదారులు	లబ్ధిదారులకు అందాల్సిన మొత్తం
ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగభృతి	76,864	రూ.2,30,59,200
మహిళకు ప్రతినెలా రూ.1500	66,307	రూ.9,94,60,500
తల్లికి వందనం	36,068	రూ.54,10,20,000
అన్నదాత సుఖభవ	30,692	రూ.61,38,40,000

నందికొట్కూరు నియోజకవర్గం		
పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధిదారులకు అందాల్సిన మొత్తం
తల్లి వందనం	40,557	రూ.60,83,55,000
అన్నదాత సుఖభవ	42,302	రూ.57,10,77,000
మహిళకు ప్రతినెలా రూ.1500	1,11,340	రూ.16,70,10,000
నిరుద్యోగ భృతి	90,000	రూ. 27,00,00,000



పెట్టుబడి సాయమేది ?



ఏడెకరాల పొలం ఉంది. 30 ఏళ్లుగా వర్షాధారం పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నా. ఏటా అతి వృష్టి, అనావృష్టితో అప్పుల ఊబిలోకి కూరుకపోతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. ఖరీఫ్ ఆరంభమై వంద రోజులు గడిచినా పట్టించుకోకపోవడం బాధాకరం. రూ.20 వేలు సాయం చేస్తామని చెప్పి ఇంతవరకు చర్యలు చేపట్టకపోవడం రైతులను మోసగించడమే.

– సుధాకర్ రెడ్డి, పీరుసాహెబ్ పేట

హామీలు నెరవేర్చేటట్లు కనబడడంలేదు



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే అవకాశం కనబడడంలేదు. అసెంబ్లీలో ముఖ్య మంత్రి స్వయంగా సూపర్ సిక్స్ హామీలంటే భయమేస్తుందన్నాడు. అంటే అధికారంలోకి రావడం కోసం ప్రజలకు నెరవేర్చలేని తప్పుడు హామీలు ఇచ్చారని అర్థం చేసుకోవలసి వస్తుంది. ఏది ఏమైనా మహిళలకు ఇచ్చిన 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రు.1,500 ఇవ్వాల్సిందే. – సయ్యద్ రేష్మా, సున్నిపెంట గ్రామం

నిరుద్యోగ భృతిని ఇవ్వాలి



మాది పేద కుటుంబం. ఎన్నో కష్టాలను తట్టుకొని డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి ఏట ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేసి విసుగువస్తోంది. ఇంకా ఆశ చావక ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటూ పొలం పనులకు వెళ్తున్నా. ఏమైనా ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు బుక్కులు కొనుక్కొనేందుకు, కోచింగ్‌లు తీసుకునేందుకు డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నాను. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇస్తే ఏదైనా కోచింగ్ తీసుకునేందుకు, బుక్కులు కొనుక్కుంనేందుకు ఆర్థికంగా చేయూత అందించినట్లు ఉంటుంది.

– కిరణ్‌కుమార్, గువ్వలకుంట్ల గ్రామస్తుడు

చేయలేనప్పుడు హామీ ఇవ్వరాదు



18 ఏళ్లు నిండినా ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఆర్భాటంగా ప్రచారం చేశారు. నమ్మి ఓట్లేశాం. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి కావస్తుంది. ఈ లెక్కన ప్రతి మహిళకు రూ.3,000 ఇవ్వాలి. అయితే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజా ప్రతినిధుల నోట మాట వినిపించడం లేదు. కనీసం అసెంబ్లీలో కూడా మహిళాశక్తి పథకం గురించి ప్రస్తావనే లేదు. చేయలేనప్పుడు ఎందుకు హామీలు ఇవ్వాలి.

– రసీదా, నందికొట్కూరు పట్టణ

పెట్టుబడి సాయం అందేనా



నాకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. పదేళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. ఏటా వ్యవసాయం, కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. జగన్ హయాంలో మాలాంటి రైతులకు న్యాయం జరిగింది. గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలు అందించారు. ఖరీఫ్, రబీలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారు. రైతుకు బాసటగా నిలిచింది జగన్ ప్రభుత్వమే. ఈ చంద్రబాబు పాలనలో పెట్టుబడి సాయం అందేది అనుమానంగానే ఉంది.

– బోయ జయరాముడు, రైతు, చింతలపల్లి

చెంచుల ఇళ్ల నిర్మాణాలకు చర్యలు



చెంచులకు టార్పాలిన్ పట్టాలు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ సురేష్‌కుమార్

పాములపాడు: చెంచులకు ఇంటి నిర్మాణాలకు చర్యలు చేపడుతామని ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్(పీఓ) సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని వేంపెంట చెంచుగూడెంలో 36 కుటుంబాలకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. పీఓ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు సరిగా లేనందున ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. తాత్కాలికంగా నివాసం ఉండేందుకు టార్పాలిన్ పట్టాలు అందిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మీకాంతారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

తాటిపాడులో ఉపాధి పనుల నిలిపివేత

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు నిలిపేయడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. తక్కువ పనిదినాలు నమోదు కావడంతో కలెక్టర్ రాజకుమారి ఇటీవల మండల ఉపాధి సిబ్బందికి చురకలంటించడంతో ఈనెల 12న ఉపాధి పనులు ప్రారంభించారు. అయితే 5 రోజులు కూడా కాకముందే పనులు నిలిపేయడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో ఇప్పటికే 50 శాతం పైబడి పనిదినాలు పనులు కల్పించగా తాటిపాడులో 36 శాతమే పని దినాలు కల్పించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయినా కూడా పనులు నిలిపివేడమేమిటో అర్థం కావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనిపై ఏపీఓ గౌరీబాయిని వివరణ కోరగా ఏపీడీ అన్వరాబేగం ఆదేశాల మేరకు పనులు నిలిపివేసినట్లు తెలిపారు. ఏపీడీని సంప్రదించగా తాను పనులు నిలిపేయమని చెప్పలేదని తెలిపారు. కాగా ఎమ్మెల్యే జయసూర్య ఆదేశాలతోనే పనులు నిలిపిసినట్లు గ్రామస్తులు చర్చించుకుంటుండటం గమనార్హం.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దాసుపై బుధవారం జిల్లా అంబుడ్స్ మెన్ సురేంద్రనాథ్ ఎంపీడీఓ మేరితో కలసి విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ దాసు ఓ వర్గానికి చెందిన వ్యక్తులకు మాత్రమే హార్టీకల్చర్ పనులు అప్పగించాడని, అవకతవకలకు పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన పుల్లయ్య, సుబ్బన్న, శ్రీనివాసులు పీడీకి ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచు జమిలాబీ, ఏపీఓ రేష్మ ఉన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లు సక్రమంగా లేకపోతే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

నందికొట్కూరు: అసైన్‌మెంట్, చుక్కల భూముల, ఇనాం, 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు సక్రమంగా లేకపోతే చట్ట పరమైన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా డిప్యూటీ కలెక్టర్ సుధారాణి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ల జాబితాలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సబ్‌రిజిస్ట్రార్ చంద్రమౌళి, తహసీల్దార్లు శ్రీనివాసులు, శివరాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడి మృతి

నందికొట్కూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన సీఐటీయూ జిల్లా నాయకులు కొణిదేల గ్రామానికి చెందిన భాస్కరరెడ్డి చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు. ఈ నెల 13న బైకుపై వెళ్తున్న భాస్కర్‌రెడ్డిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయాలకు గురికావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక తుది శ్వాస విడిచారు.


ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

బండిఆత్మకూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌జా పిలుపునిచ్చారు. జెడ్పీహైస్కూల్ హెచ్ఎం యశోధ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మొక్కలు నాటారు.

నాటుసారా స్వాధీనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ముఖద్వారం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా సున్నిపెంటకు చెందిన ఓ వ్యక్తి వద్ద 20లీటర్ల నాటుసారా కలిగి ఉండడం గుర్తించినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. సారా, టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని పలు కాలనీలలో కొలువుదీరిన బొజ్జగణపయ్యల నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. 11 రోజుల పూజల అనంతరం పాతాళగంగలో నిమజ్జనం చేశా రు.

లడ్డూ ప్రసాదం రూ.5.03లక్షలు

శ్రీశైలం వర్క్‌షాపు వద్ద విద్యా వినాయక గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుంచిన గణపతి లడ్డూ ప్రసాదాన్ని రూ.5.03లక్షలకు శ్రీశైలంకు చెందిన కాంట్రాక్టర్ రమణ దక్కించుకున్నారు.

మధుసురేష్‌ది హత్యే



మాట్లాడుతున్న డీఎస్పీ రామంజినాయక్

ఆత్మకూరు: అనుమానాస్పదంగా మృతి చెందిన మధుసురేష్(26)ది హత్యేనని పోలీసులు తేల్చారు. బుధవారం ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన మధుసురేష్ కనిపించడం లేదని తండ్రి బోయ నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాములపాడు పోలీసులు 04-08-2024న కేసు నమోదు చేసుకుని అప్పటి ఎస్ఐ అశోక్‌కుమార్, సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఆ తరువాత ఈదురువాగులో అతని మృతదేహం లభ్యమయ్యింది. అయితే అతను ప్రమాదవశాత్తు మృతిచెందాడా లేక ఇతర కారణాలతో చనిపోయాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ ఇప్పటికీ కొనసాగుతుండటంతో కరివేన గ్రామానికి చెందిన అన్నదమ్ములు శ్యామ్, రాజేష్‌లు ఎట్టకేలకు విషయం బయటకు వస్తుందని భయాందోళన గురై తామే ఈ హత్య చేశామని గ్రామ వీఆర్వో శివశంకర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీఆర్వో వెంటనే ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి విచారించగా హత్యకు గల కారణాలను వెల్లడించారు. శ్యామ్ భార్యకు మధుసురేష్ ఫోన్‌లో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ అసభ్యకరంగా వ్యవహరించేవాడని, గతంలో హెచ్చరించినా మారలేదని, దీంతో 31-07-2024న రాత్రి మధుసురేష్‌ను పొలం వద్దకు మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి తాపీతో తలపై గట్టిగా బాది చంపివేశామని నిందితులు ఒప్పుకున్నారు. మృతదేహాన్ని దగ్గరలోని ఈదురువాగులో పారవేసి, అతని బట్టలను పెట్రోల్ పోసి అట్టించినట్లు తెలిపారు. నేరం ఒప్పుకోవడంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేధించిన సీఐ సురేష్ కుమార్‌రెడ్డిని, పాములపాడు ఎస్ఐ సురేష్‌లను డీఎస్పీ అభినందించారు.

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఆత్మకూరు/శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంకు చెందిన మహిళ సున్నం నాగమల్లమ్మ(24) ఆత్మహత్యకు కారకుడైన బైసాని కార్తిక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. బుధవారం మహిళ ఆత్మహత్య కేసుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. శ్రీశైలం గ్రామానికి చెందిన సున్నం (మధులత) నాగమల్లమ్మ (24), ఇదే గ్రామానికి చెందిన బైసాని కార్తీక్ మూడేళ్ల నుంచి ప్రేమించుకున్నారన్నారు. ఈ నెల తొమ్మిదవ తేదీ మధ్యాహ్నం శ్రీశైలంలోని పాతాళగంగరోడ్డు వద్ద గల ఆంజనేయస్వామిగుడిలో వివాహం చేసుకున్నారన్నారు. రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు రావడంతో నాగమల్లమ్మతో నీవల్లే నా జీవితం నాశనం అయిందని గొడవపడ్డారు. కార్తీక్ తిట్టడంతో నాగమల్లమ్మ గడ్డిమందు తాగిందని, సున్నిపెంట వైద్యశాలలో వైద్యచికిత్సలు నిర్వహించి జిల్లా వైద్యశాలకు తరలించగా 10వ తేదీన ఉదయం మృతి చెందిందని పేర్కొన్నారు. మృతురాలి అన్న శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఎదుట అరెస్ట్ చూపి, రిమాండ్ నిమిత్తం ఆత్మకూరు కోర్టుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మృతుడు వేంపెంట వాసి

బండిఆత్మకూరు: పరమటూరు గ్రామం వద్ద కుందూ నదిలో లభ్యమైన మృతదేహం వేంపెంట గ్రామానికి చెందిన మూల వెంకటరమణ (75)గా గుర్తించినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. బుధవారం కేసు నమోదు చేసి విచారించగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాల వల్ల మంగళవారం నిప్పుల వాగులో దూకాడని, అతని కొడుకు లెనిన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కొడుకు లెనిన్‌కు అప్పగించడం జరిగింది.